క్లుప్తంగా

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

కందుకూరు: తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఐదోతరగతిలో ప్రవేశం కోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు మహేశ్వరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఈమని శ్రీలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష కొనసాగుతుందన్నారు.ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని హాల్‌టికెట్, పరీక్షా ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్, వాటర్‌బాటిల్ తీసుకుని రావాలన్నారు.మండల కేంద్రంలోని గూడూరు గేట్ సమీపం శ్రీశైలం రహదారిపై ఉన్న ఎస్ ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయంలోపు హాజరు కావాలన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ నిర్వహించారు .శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని శుక్రవారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయిశెట్టి యాదయ్య, లక్ష్మణ్‌చారి పాల్గొన్నారు.

పహాడీషరీఫ్‌లో ఇఫ్తార్ విందు



కౌన్సిలర్‌ను సన్మానించిన మైనార్టీ నేతలు

పహాడీషరీఫ్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి 13వ వార్డు కౌన్సిలర్ పందెం పుష్పమ్మ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండల్ యాదవ్ ముస్లింలకు పండ్లను తినిపించి ఈద్ ముబారక్ తెలిపారు. నాయకులు దస్తగిర్, సమీర్, అబ్దుల్లా బిన్ అవద్, మేరాజ్ ఖాన్, సూర్యకుమార్ గౌడ్, విశాల్ గౌడ్, శంకర్ యాదవ్, నయీం, సతీష్, సమీర్, మినాజ్, సత్తార్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ హయత్‌నగర్ ఉపాధ్యక్షుడిగా గట్ల రవీంద్ర

దిల్‌సుఖ్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్‌నగర్ డిస్ట్రిక్ట్ 320సి ఉపాధ్యక్షుడిగా ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన గట్ల రవీంద్ర (హైటెక్ రాము) నియమితులయ్యారు. లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గార్లపాటి జితేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. నూతన కార్యవర్గంలో జోన్ చైర్మన్‌గా పెండం కృష్ణ కుమార్, అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గట్ల రవీంద్ర, కార్యదర్శిగా జి సంతోష్ కోశాధికారిగా అశోక్ కుమార్‌లను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గట్ల రవీంద్ర మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.శంకర్, పి.భార్గవరాజు, లింగారెడ్డి, వనం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని స్వేరో సర్కిల్‌లోని విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ లలితాజ్యోతయ్య పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్ బుక్కులు, పెన్సిళ్లు అందజేశారు. ఈనెల 23న విద్యార్థులకు గురుకుల ఎంట్రెన్స్ పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం వీటిని పంపిణీ చేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో స్వేరో సర్కిల్ నిర్వాహకులు సురేష్, ఈశ్వర్, జంగయ్య, వెంకటయ్య, శ్రీశైలం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: రంజాన్ కానుకలు అందజేస్తున్న సబితారెడ్డి, అనితారెడ్డి



కందుకూరు: రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మంత్రి సబితారెడ్డి
- ముస్లింలకు రంజాన్ కానుకల అందజేత

మహేశ్వరం: హిందూ – ముస్లింల ఐక్యతకు ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని నందుపల్లి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు, రంజాన్ కానుకలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలన్నారు. అన్ని మతాల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ ఎండీ ఉస్మాన్, పీఏసీఎస్ చైర్మన్ ఎం పాండు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కే రాజు, నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు సరుకుల అందజేత

పహాడీషరీఫ్: రంజాన్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం జల్‌పల్లి మున్సిపాలిటీలో పేద ప్రజలకు కాంగ్రెస్ నాయకులు సరుకులు అందజేశారు. పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు డీ భాస్కర్‌రెడ్డి సమకూర్చిన కిట్లను నాయకులు హబీబ్ ఉమర్, ఎం రవికుమార్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదిరకం కారణంగా కొందరు పండుగ చేసుకోలేని పరిస్థితి ఉంటారని వారి కోసం సరుకులు అందజేసినట్లు తెలిపారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ కానుకల పంపిణీ

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను ముస్లింలకు పంపిణీ చేశారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత అన్నివర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నారని ఈ సందర్భంగా సర్పంచ్ కొని యాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమలత, వార్డు సభ్యుడు విన్సెంట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు నగేష్‌గౌడ్, జహంగీర్, ఎండీ గౌస్, మదర్ సాబ్, హలీమ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో పీసీసీ కార్యదర్శి ఏ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి సీ సుధీర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు డీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏ జంగారెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు స్నేహభావానికి ప్రతీక అన్నారు. అనంతరం ముస్లింలకు రంజన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాల్‌రెడ్డి, జైహింద్, కాంగ్రెస్ పార్టీ కందుకూర్ మండల అధ్యక్షుడు కృష్ణ నాయక్, నాయకులు ధనరాజ్, ప్రభాకర్‌రెడ్డి, షెరీఫ్‌ఖాన్, సయ్యద్ అఫ్జల్, హైమద్‌బామ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి, ఉమేష్ పాల్గొన్నారు.

ప్రార్థనలకు ఈద్గాలు సిద్ధం

పహాడీషరీఫ్: రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రార్థనలు నిర్వహించేందుకు వచ్చే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా ఈద్గాలు, మసీదుల వద్ద జల్‌పల్లి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈద్గాల వద్ద చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేశారు. జల్‌పల్లి, వాదే ముస్తఫా, కొత్తపేట, పహాడీషరీఫ్ ఈద్గాలను మున్సిపల్ కమిషనర్ ఎస్ వసంత పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మున్సిపాలిటీ తరఫున అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు బీ భాస్కర్, కాశీ విశ్వనాథ్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

రంజాన్ కానుకల అందజేత

హుడాకాంప్లెక్స్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ ఫేజ్–2లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మహమ్మద్ సలీం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున పేద ముస్లింలకు కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, నాయకులు ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనాలు అందించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



సంఘీభావం తెలుపుతున్న భూపాల్

మహేశ్వరం: గ్రామాల్లో పనిచేసే వీఓఏలకు కనీస వేతనాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారంతో ఐదోరోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వీఓఏలు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం వీఓఏలతో వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హస్తోందన్నారు. గ్రామాల్లో పనిచేసే వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అర్హత కలిగిన వీఓఏలకు డబుల్ బెడ్‌రూమ్స్, దళితబంధు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీఓఏల పక్షాన సీఐటీయూ పోరాడుతుందన్నారు. జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ రజిత, సిఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు రవికుమార్, మండల కన్వీనర్ శేఖర్, వీఓఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె..

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు సీఐటీయూ మండల అధ్యక్షుడు బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారంకు ఐదోరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏలు చెవులో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి మత్స్యకార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పూలగాజుల జంగయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సరస్వతి, వీఓఏలు విజయ, పావని, శశికళ, జ్యోతి, మాధవి, మంజుల, పద్మ, రమ్య, రవీందర్, పర్వతాలు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరేస్తాం



నియామకపత్రాలను అందిస్తున్న మల్లారెడ్డి

జిల్లా పంచాయతీరాజ్ కన్వీనర్ మల్లారెడ్డి

కందుకూరు: రాబోయే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ జిల్లా పంచాయతీరాజ్ కన్వీనర్, కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని నేదునూరులో బీజేపీ బూత్ కమిటీల సమావేశాన్ని నిర్వహించి, పూర్తిస్థాయి బూత్ కమిటీలను నియమించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొక్క సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సోమరాజు వెంకటేష్, గంగుల వెంకట్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రవీణ్, బూత్ అధ్యక్షులు యాదగిరి, భరత్‌కుమార్, భిక్షపతి, కిషోర్‌చారి, శ్రీశైలం పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

మంత్రి సబితారెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సబితారెడ్డి ప్రారంభించారు. మల్లికార్జున నగర్ కాలనీ, లోకాయుక్తా, సాయినగర్, గాయత్రిహిల్స్ కాలనీల్లో రూ.2.79 కోట్లతో చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్లు, వాటర్ పైప్ లైన్ పనులు అలాగే లోకాయుక్తా కాలనీలో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్‌లను ప్రారంభించారు. కాగా కాలనీవాసులు అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పారు. అనంతరం మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ డివిజన్‌లో బీజేపీ కార్పొరేటర్‌ను ఎన్నుకున్నప్పటికీ ఏలాంటి తారతమ్యం చూపించకుండా ఇప్పటికి వరకు రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చుచేశామని వెల్లడించారు. అభివృద్ధిలో బడంగ్‌పేట కార్పొరేషన్ దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈ అశోక్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అమిత శ్రీశైలంచారి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, తదితరులున్నారు.

గ్రాడ్యుయేషన్‌డే మధుర జ్ఞాపకం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

డీజీఎం గోపాల్‌రెడ్డి

మీర్‌పేట: ప్రతి విద్యార్థి జీవితంలో గ్రాడ్యుయేషన్ డే ఓ మధుర జ్ఞాపకమని మీర్‌పేట నారాయణ ఒలంపియాడ్ పాఠశాల డీజీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్‌డే వేడుకకు ఏజీఎం రవీందర్‌బాబుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు అన్ని అంశాల్లో నైపుణ్యం సాధించేలా విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబ్జీ, ఈ ఛామ్స్ ఆర్‌అండ్‌డీ మహేశ్వరీ, కో ఆర్డినేటర్ వాణి, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటివెలుగుతో పేదలకు మేలు



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ చిగురింత పారిజాత కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్, మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. చూపు మందగించిన వారు, అలాగే శుక్లాల సమస్యలు ఉన్నవారు కంటి పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలను పొందాలన్నారు. కంటి వెలుగుతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశవర్కర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తుక్కుగూడ: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ బరిగెల హేమలత సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ పథకము ద్వారా ఉచితంగా కంటి పరీక్షలతో పాటు, కళ్లజోడును ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, డాక్టర్ రాజుకుమార్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రి సబితారెడ్డికి కార్పొరేటర్ శ్రీవాణి లేఖ

హుడాకాంప్లెక్స్: నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్తున్న మంత్రి.. సరూర్‌నగర్ డివిజన్‌కు ఎన్ని నిధులు మంజూరు చేయించారో చెప్పాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని శుక్రవారం ఆమె మంత్రికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబితారెడ్డి గత 15 సంవత్సరాలుగా మహేశ్వరం నియోజకవర్గానికి చేసిందేమీలేదన్నారు. తాము సమస్యలను ప్రస్తావిస్తే ఇప్పుడు డివిజన్ సమస్యలు తెలుసుకుంటున్నామని మంత్రి భజన బ్యాచ్ కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. అన్ని విషయాలను లేఖలో ప్రస్తావించామని పేర్కొన్నారు. డివిజన్ ప్రజలకి కావాల్సింది డ్రామాలు కాదని, నిధులు కావాలని.. తక్షణమే డ్రైనేజీ పైపులైన్, సీసీ, బీటీ రోడ్లకి, నాలాలకి కమ్యూనిటీహాళ్లకు, పార్కులకు, విద్యాలయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించండని లేఖలో కోరారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి



అధికారులకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎస్ రెడ్డి డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సర్కిల్ సిబ్బంది సహకరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్ అండ్ ఆర్‌డబ్ల్యూఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్కిల్ అధికారులు, సిబ్బంది డివిజన్‌లో పర్యటించి డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సర్కిల్ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కొన్ని కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని, లోప్రెషర్ తాగునీటి సరఫరా వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్కిల్ డీఈ దామోదర్‌రావు, వాటర్ వర్క్స్ మేనేజర్ వాహిని, ఎంటమాలజీ సిబ్బంది నరేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బంది జానికీరామ్, భానుప్రకాష్, సంజీవరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు తిరుమలేష్, బాల నర్సింహ, అశోక్, లక్ష్మణ్, గట్టయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ హరిపురికాలనీలోని విబ్జియార్ ఉన్నత పాఠశాల 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ టీవీ, సినిమా, సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యకు తమ పాఠశాల చిరునామాగా నిలిచిందన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం



ప్రశాంత్‌నగర్ ఫేజ్‌-2 ప్రధాన రహదారి దుస్థితి



రాఘవనగర్ కాలనీలోని అంతర్గత రహదారి

శిథిలావస్థలో అంతర్గత రోడ్లు

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంతర్గత రహదారులు ధ్వంసమై, గుంతలమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ, ఇతర అవసరాల కోసం కాలనీ రోడ్లను అడ్డగోలుగా తవ్వి అలాగే వదిలేయడంతో రహదారులన్నీ గుంతలు తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయని కాలనీ, బస్తీవాసులు పేర్కొంటున్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ లైన్ల కోసం కార్పొరేషన్ వారు తవ్వకాలు చేపట్టి ఆ తరువాత తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో మంచిగా ఉన్న రహదారులు కాస్తా అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీలవాసులు వాపోయారు. కార్పొరేషన్ పరిధిలోని మెజార్టీ కాలనీల్లోని అంతర్గత రహదారుల పరిస్థితి ఇలాగే ఉందని.. గతంలో ద్వారకామయినగర్ కాలనీలో ధ్వంసమైన రోడ్డును కాలనీవాసులే స్వయంగా మట్టితో పూడ్చిన సంఘటనలు ఉన్నాయి.

లెనిన్‌నగర్ ప్రాంతంలోనూ...

కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ ప్రాంతంలోని ప్రశాంత్‌నగర్ ఫేజ్–1, 2, మురళీకృష్ణానగర్ బస్తీలోనూ రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఏళ్ల క్రితం వేసిన అంతర్గత రహదారులు గుంతలు, రాళ్లుతేలి ఇబ్బందికరంగా ఉన్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని బస్తీవాసులు పేర్కొంటున్నారు. కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేసిన అధికారులు, అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లను అభివృద్ధి చేస్తాం

కాలనీలు, బస్తీల్లో ధ్వంసమైన అంతర్గత రహదారులను ఇప్పటికే గుర్తించాం. వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే రహదారులన్నింటినీ అభివృద్ధి చేస్తాం.

– నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్